# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 14, ఫిబ్రవరి 2026




విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన

# ఉపాధ్యాయుడి సస్పెండ్

★ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి




**ఆసిఫాబాద్, పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

పాఠశాల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారం తెలిపారు. జిల్లాలోని పెంచికల్ పేట మండలం చేడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ విద్యార్థినులతో అసభ్య పదజాలంతో సంభాషించి, అనుచితంగా ప్రవర్తించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేసిన ఫిర్యాదు మేరకు డిప్యూటీ డైరెక్టర్(ట్రైబల్ వెల్ఫేర్), ఆసిఫాబాద్ డిఎచ్ఇడబ్ల్యు విచారణ జరుపగా విద్యార్థినుల నుంచి వచ్చిన ఫిర్యాదు నిజమని తేలడంతో సదరు ఉపాధ్యాయుడిని విధుల నుండి సస్పెండ్ చేస్తూ, పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించడం జరిగిందని తెలిపారు. క్రమశిక్షణా చర్యలు ముగిసే వరకు అభియోగాలకు సంబంధించిన అన్ని చర్యలను ముగించే వరకు ప్రజా ప్రయోజనం దృష్ట్యా ఉద్యోగి సస్పెన్షన్‌లో కొనసాగుతారని, ఉత్తర్వులు అమలులో ఉన్న కాలంలో సదరు ఉపాధ్యాయుడు ముందస్తు అనుమతి పొందకుండా ప్రధాన కార్యాలయం నుంచి బయటకు వెళ్లకూడదని తెలిపారు.

# ఉమ్మడి ఆదిలాబాద్‌లో

# రాజకీయ సమీకరణాల సంచలనం



కాంగ్రెస్‌కు ఝలక్..
బిఆర్ఎస్‌కు ఊపిరి..
బీజేపీ ప్రభావం క్షీణం

పట్టణ పోరులో
పట్టు మార్చిన ప్రజలు

హంగ్ హడావిడి...
స్వతంత్రులే కింగ్ మేకర్లు

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికల ఫలితాలు నేడు వెలువడగా జిల్లా రాజకీయాల్లో సంచలనం రేపాయి. అధికార కాంగ్రెస్ కు, ప్రతిపక్ష బిఆర్ఎస్ గట్టి ఝలక్ ఇచ్చింది. నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్న బీజేపీ సైతం ప్రభావాన్ని కోల్పోయి ఒక్క ఛైర్మెన్ స్థానానికే పరిమితమైంది. ఎంఐఎం పార్టీ బైంసాలో తన పట్టు నిలబెట్టుకుంది. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 49 వార్డుల్లో బీజేపీ 21 స్థానాలు గెలిచి ఛైర్మెన్ పీఠం దక్కించుంది. అధికార కాంగ్రెస్ 11, బిఆర్ఎస్ 6స్థానాల్లో గెలవగా 11 మంది స్వతంత్రులు విజయం సాధించారు. 2లో..

# ఓంకార రూపాయ... నమః శివాయ

✤ మహాశివరాత్రికి ముస్తాబైన ఈశివమల్లన్న ఆలయం

✤ నేటి నుంచి మూడు రోజుపాటు హహాశివరాత్రి జాతర మహోత్సవాలు

✤ భారీగా తరలిరానున్న భక్తులు



**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మండలంలోని ఈస్గాం శివమల్లన్న ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 14 శనివారం నుంచి 16వ తేదీ సోమవారం వరకు మూడు రోజుల పాటు మహాశివరాత్రి జాతర ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. జాతర ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా తెలిపారు. వేలాదిగా భక్తులు తరలి రానున్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్లకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. కాగజ్‌నగర్ మండలం, పట్టణం నుండే కాకుండా జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి జాతరకు వేలాదిగా భక్తులు మిగతా 2లో..






# త్రాగునీటి కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు

**మందమర్రి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

వేసవి కాలం పూర్తిగా ప్రారంభం కాకముందే మందమర్రి పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. వ్యాపార సముదాయానికి ఆనుకుని ఉన్న కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. మార్కెట్ ప్రాంతం నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం కావడంతో పాటు అనేక కుటుంబాలు అక్కడే నివసిస్తున్నాయి. అయితే, ఇటీవలి రోజులుగా నీరు అడపాదడపా మాత్రమే వస్తోందని, వచ్చినా సరిపడా ఒత్తిడి లేకపోవడంతో నిల్వ చేసుకునే పరిస్థితి కూడా లేదని స్థానికులు వాపోతున్నారు. అసలే ఎండలు మిగతా 2లో..

# ఉమ్మడి ఆదిలాబాద్‌లో రాజకీయ సమీకరణాల సంచలనం

**(మొదటిపేజీ తరువాయి)**

నిర్మల్ మున్సిపాలిటీలో అధికార ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి కాంగ్రెస్ ఊహించని షాక్ ఇచ్చింది. 42 వార్డుల్లో కాంగ్రెస్ నెగ్గి ఛైర్మన్ పదవిని ఖాయం చేసుకోగా, బీజేపీ 14 స్థానాలకు పరిమితమైంది. బిఆర్ఎస్ కేవలం ఒక స్థానంలో గెలిచి మనుగడ కోల్పోగా ఇతరులు రెండు వార్డుల్లో విజయం సాధించారు. ఖానాపూర్‌లో 12 వార్డులు ఉండగా త్రిముఖ పోరు ఏర్పడింది. కాంగ్రెస్, బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు తలో నాలుగు స్థానాల్లో గెలుపొందగా,, ఎవరు ఎవరితో కలిసి ఛైర్మన్ పీఠాన్ని అధిరోహిస్తారనే చర్చ కొనసాగుతుంది. భైంసా మున్సిపల్ లో ఎంఐఎం 17 స్థానాల్లో గెలిచి పదవిని నిలబెట్టుకోగా, బిఆర్ఎస్ 5 స్థానాల్లో, అధికార కాంగ్రెస్ 4, బీజేపీ 3 స్థానాల్లో గెలిచాయి. నూతనంగా ఏర్పడిన జిల్లా కేంద్ర మున్సిపాలిటీ ఆసిఫాబాద్ లో 20 వార్డుల్లో బిఆర్ఎస్ 9 వార్డుల్లో నెగ్గగా, అధికార కాంగ్రెస్ 7 స్థానాల్లో గెలించింది. నలుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. ఇక్కడ స్వతంత్రుల మద్దత్తు కీలకంగా మారనుంది. కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులకు గాను బిఆర్ఎస్ 11 స్థానాల్లో గెలిచి, అధికార కాంగ్రెస్ కు, బీజేపీ అధికార ఎమ్మెల్యే హరీష్ బాబుకు బిగ్ షాక్ ఇచ్చింది. కాంగ్రెస్ 9, బీజేపీ 5 స్థానాల్లో గెలవగా స్వంతంత్రులు 4, ఎంఐఎం ఒక చోట నెగ్గింది. ఇక్కడ ఛైర్మన్ పీఠం కోసం బిఆర్ఎస్ కు స్వంతంత్రుల మద్దతు లభిస్తే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ బీజేపీ అవగహన చర్చలు కూడా జోరుగా కొనసాగుతున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. బెల్లంపల్లిలో మొత్తం 34 వార్డుల్లో కాంగ్రెస్ 14, బిఆర్ఎస్ 14 స్థానాలు గెలిచి సమఉజ్జీలుగ నిలిచాయి. స్వతంత్రులు 5 స్థానాల్లో, బీజేపీ ఒక స్థానంలో విజయం సాధించాయి. ఛైర్మన్ ఎన్నిక ఉత్కంఠభరితంగా మారింది. క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో 22 వార్డుల్లో బిఆర్ఎస్ 10 స్థానాల్లో, అధికార కాంగ్రెస్ 7, స్వతంత్రులు 4, బీజేపీ 2 స్థానాల్లో నెగ్గగా బిఆర్ఎస్ ఆధిక్యం సాధించింది. ఇక్కడి ఫలితాలు మంత్రి వివేక్ వెంకటస్వామికి పరాభవాన్ని మూటగట్టాయి. చెన్నూర్ మున్సిపాలిటీలో 18 స్థానాలకు గాను కాంగ్రెస్ 11 స్థానల్లో విజయం సాధించి ఛైర్మన్ పీఠాన్ని దక్కించుకోగా, బిఆర్ఎస్ 4, బీజేపీ 2, ఒక స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించాడు. లక్శెట్ పేట్ మున్సిపాలిటీలో 14 వార్డుల్లో కాంగ్రెస్ 11 స్థానాలు గెలిచి ఛైర్మన్ పీఠాన్ని కాపాడుకుంది. బిఆర్ఎస్ 3 స్థానాలు గెలిచింది. కార్పొరేషన్‌లో కాంగ్రెస్ దూకుడు మంచిర్యాల మేయర్ పీఠం కైవసం మంచిర్యాల కార్పొరేషన్ లో అధికార హస్తం పార్టీ దూకుడైన ఫలితాన్ని ఖాతాలో వేసుకుంది. మొత్తం 60 కార్పొరేటర్లకు గాను, 44 స్థానాలలో విజయ పరంపర కొనసాగించి, మేయర్ పీఠాన్ని అధి రోహించింది. ప్రతిపక్ష బిఆర్ఎస్ కేవలం 8 స్థానాలకే పరిమితం అయింది. బీజేపీ సైతం తన పట్టుకోల్పోయి 5 స్థానాలతో సరి పెట్టుంది. ఇత రులు 3స్థానాల్లో విజేతలుగా నిలి చారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ మూడు మున్సిపాలిటీల్లో ఛైర్మన్ పీఠాన్ని చేజిక్కించుకోగా బిఆర్ఎస్ మూడు చోట్ల తన ప్రాబల్యాన్ని చాటింది. బీజేపీ ఒక చోట మాత్రమే ఆధిపత్యం సాధించింది. భైంసాలో ఎంఐఎం తన బలాన్ని మరోసారి చాటింది. బెల్లంపల్లి, ఖానాపూర్ లో హాంగ్ పరిస్థితులు నెలకొనగా ఛైర్మన్ పదవి కోసం రాజకీయ చర్చలు, మైత్రి కూటముల కసరత్తులు జోరందుకున్నాయి. జిల్లా రాజకీయ సమీకరణాలు కొత్త మలుపు తిరిగిన ఈ ఫలితాలు రాబోయే ఎన్నికలకు దారిదీపంగా మారనున్నాయి.




## అచ్చలాపూర్‌లో గ్రామసభ

**తాండూర్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త :**



మండలంలోని అచ్చులాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ మరిశెట్టి స్రవంతి అధ్యక్షతన సాధారణ గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో సమ్మర్ యాక్షన్ ప్లాన్, అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలు, గురించి చర్చించారు. గ్రామసభలో వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు: పీఆర్‌టీయూ

**- పెండింగ్ బిల్లులు, డీఏలు వెంటనే చెల్లించాలి**

**భైంసా, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ లక్ష్యమని, దీర్ఘకాలికంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తప్పదని పీఆర్‌టీయూ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి. రమణారావు హెచ్చరించారు. భైంసాలోని పీఆర్‌టీయూ భవన్‌లో సోమవారం సంఘం 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పతాకాన్ని ఆవిష్కరించి, వ్యవస్థాపకులు కీర్తిశేషులు సామల యాదగిరి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రమణారావు మాట్లాడు తూ.. గత ఐదు దశాబ్దాలుగా ఉపాధ్యాయుల హక్కుల కోసం, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం పీఆర్‌టీయూ నిరంతరం పోరాడుతోందన్నారు. ఉపాధ్యా యులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, మెరుగైన పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారీ ఎత్తున ఉద్యమ కార్యాచరణ చేపడతామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులనే అధి ష్ఠానంగా భావించి ముందుకు సాగుతున్న ఏకైక సంఘం పీఆర్‌టీయూ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘానికి విశేష సేవలు అందించి పదవీ విరమ ణ పొందిన సీనియర్ కార్యకర్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో బాలమృతం, గుడ్లు పంపిణీ

**తాండూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

తాండూర్ సెక్టార్ లోని మహాలక్ష్మివాడ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం లబ్ధిదారులకు బాలమృతం, కోడిగుడ్లును సర్పంచ్ ముడిమడుగుల సురేష్, ఉప సర్పంచ్ సత్యనారాయణ పంపిణీ చేశారు. కార్యక్రమం లో మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా నాయకులు దుర్గ చరణ్, అంగన్వాడి టీచర్ బాల భారతి, గ్రామ కార్యదర్శి దివాకర్, ఏఎల్‌ఎంఎస్సి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మంచిర్యాల కార్పొరేషన్.. కాంగ్రెస్ కైవసం

**- 44 వార్డుల్లో ఘన విజయం.. విపక్షాలు బహుదూరం**

**నస్పూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ధీమా వ్యక్తం చేసిన ప్రేమ్‌సాగర్‌రావు అంచనాలకు తగ్గట్లుగా ఫలితాలు వెలువడ్డాయి. కార్పొరేషన్‌లో మొత్తం 60 వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 44 స్థానాలను కైవసం చేసుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ ఎన్నికల్లో విపక్షాలు నామ మాత్రపు స్థానాలకే పరిమితమయ్యాయి. బీఆర్ఎస్ 8 వార్డుల్లో, బీజేపీ 5 వార్డుల్లో, ఏఐఎఫ్‌బీ 2 వార్డుల్లో, జనసేన ఒక వార్డులో విజయం సాధించాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పార్టీ విజ యానికి తోడ్పడ్డాయి. అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విజయవంతమయ్యాయి. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుతో పాటు మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మంచిర్యాల కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ఈ ఫలితా లు నిరూపించాయని నాయకులు పేర్కొంటున్నారు. తొలిసారి జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. పార్టీ కార్యకర్తలు పట్టణంలో పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. భారీ మెజారిటీ సాధించిన నేపథ్యంలో మంచిర్యాల తొలి మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను అధిష్టించే అదృష్టం ఎవరికి దక్కుతుందో తెలుసుకోవడానికి కాంగ్రెస్ శ్రేణులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. అభ్యర్థుల ఎంపికపై అటు ప్రజలు, ఇటు పార్టీ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది.

## దొరికిన సెల్‌ఫోన్ ఎస్సైకి అప్పచెప్పి నిజాయితీ చాటుకున్న విద్యార్థి

**జన్నారం, ప్రభాతవార్త**



మనం తరచూ పేపర్ కానీ సోషల్ మీడియాలో కానీ పిల్లలు సెల్ ఫోన్‌కి బానిసై పోతున్నారు అని ఎంతో మంది తల్లిదండ్రులు వాపోతున్న ఈ కాలంలో ఈ విద్యార్థి మాత్రం దొరికిన సెల్ ఫోన్ గురించి వారి తండ్రికి సమాచారం ఇచ్చి అనంతరం పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఎస్సైకి అప్పచెప్పి తన నిజాయితీ చాటుకున్నారు. ఈ సందర్భంగా గోలి మణికంఠను జన్నారం ఎస్సై గొల్లపల్లి అనూష ప్రత్యేకంగా అభినందించారు. తదనంతరం సెల్ ఫోన్ యజమాని ఫోన్ చేయడంతో స్టేషన్ కి వచ్చి తీసుకుని వెళ్ళమని చెప్పడండంతో మణికంఠ చేతుల మీదుగా అతనికి ఫోన్ అందచేశారు. ఎస్సై గొల్లపల్లి అనూష, గ్రామస్తులు మణికంఠను అభినందించారు.

## ఓంకార రూపాయ... నమః శివాయ

**(మొదటిపేజీ తరువాయి)**

తరలిరానున్నారు. జాతరకు వచ్చే బక్తుల సౌకర్యార్థం ఆసిఫాబాద్ డిపో నుండి ఈస్గాం వరకు ఆర్టిసి ఆధ్వర్యంలో ప్రత్యేబస్సు సౌకర్యం కల్పించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఈస్గాం పీహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ వారిచే మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కాగజీనగర్ డీఎస్పీ వహిదుద్దీన్ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ రూరల్ సీఐ కుమారస్వామి ఆదేశాలమేరకు ఈస్గాం ఎస్సై కళ్యాణ పోలీసు సిబ్బందితో బందోబస్తు చేపట్టనున్నారు.

### ఈస్‌గాం శివ మల్లన్న ఆలయ చరిత్ర...

భక్తులు కొంగుబంగారమైన ఈస్‌గాం శివమల్లన్న ఆలయంలో శివరాత్రి జాతరకు ముస్తాబు చేశారు. ఇక్కడ శివుడు ఎంతో మహిమ గల వాడని, పూజలు నిర్వహిస్తే కోరిన కోరికలు నెరవేతాయన్నది భక్తుల విశ్వాసం. కాగజ్‌నగర్‌కు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి వందేళ్ల చరిత్ర ఉంది. ఈ శివాలయంలో నలువైపులా హన్మంతుడు, వినాయకుడు, కాల భైరవుడు, వీరభద్ర స్వామి, మహంకాళీ దేవత, శీతల దేవత, అమ్మవారి విగ్రహాలు ఉన్నాయి. 9వ శతాబ్దంలో శివుడు వెలిసినట్లుగా స్థల పురాణం ప్రకారం చారిత్రక ఆధారాలు ఉన్నాయి. కాకతీయుల కళాఖండాలు కనబడతాయి. 1979 మే నెలలో శివ మల్లన్న పేరుతో ప్రాణప్రతిష్టి గావించబడింది. ఇక్కడ శివ లింగానికి స్వభావ సిద్ధమైన విభూతి రేఖలు ఉండుట విశేషం. ప్రకాశ, కార్తీక మాసాలలో ప్రత్యేక అభిషేశాలు, దసరా, మార్గశిర మాసంలో షష్టిబోనాలు నిర్వహించబడతాయి. శివరాత్రికి మూడు రోజులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

### మూడు రోజుల పాటు మహాశివరాత్రి జాతర మహోత్సవ కార్యక్రమాలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం 14వ తేదీన ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, 5 గంటలకు స్వామి వారికి అభిషేకము, ఉదయం 6 గంటల నుండి రాత్రి 8. గంటల వరకు సర్వ దర్శనము, అర్చనలు, అభిషేకములు, మధ్యాహ్నాం 12 గంటలకు నివేద, హారతి, రాత్రి 8 గంటలకు మహాహారతి, రాత్రి 9 గంటలకు ద్వార బంధనం, 15వ తేదీ శనివారం సుహాశివరాత్రి సందర్భంగా ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 4.30 గంటలకు రుద్రాభిషేకము, ఉదయం 5 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు స్వామివారి దర్శనం, సాయంత్రం 5.35 గంటలకు శ్రీ శివమల్లన్న స్వామి వారి కళ్యాణ మహోత్సవం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు దంపతులచే నిర్వహించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుండి ఉమ్మడి ఆదిలాబాద్ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులచే కళ్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. రథోత్సవ కార్యక్రమం జితేందర్ కుమార్ రుంగ్టా కాగజ్‌నగర్ వారిచే ప్రారంభించనున్నారు. రాత్రి 11 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకము, రాత్రి 12 గంటలకు నిశీ భార్గవి పూజ (బిల్వార్చన) కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 16వ తేదీ సోమవారం రోజున ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవ, ఉదయం 5 గంటలకు అభిషేకము, ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నాం 12 గంటల వరకు సర్వదర్శనము, పూజలు, మధ్యాహ్నాం 2. గంటల నుండి రాత్రి 7 గంటల వరకు సర్వదర్శనము, అర్చనలు, అభిషేకములు, రాత్రి 8 గంటలకు సమాహారతి ద్వారబంధం పూజా కార్యక్రమూలు ఉంటాయని, ఆలయ అర్చకులు ఇందారపు సంతోష్ శర్మ, వేద పండితులు ముద్దు నరహరి శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఉంటాయని భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

## త్రాగునీటి కోసం రోడ్డెక్కిన కాలనీవాసులు

**(మొదటిపేజీ తరువాయి)**

తీవ్రంగా పెరుగుతున్న తరుణంలో తాగునీరు అందుబాటులో లేకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. కొంతమంది మహిళలు, వృద్ధులు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని, చిన్నారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు తెలిపారు. సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి ఇంకా ముదురకముందే ఈ పరిస్థితి ఉంటే, ముందున్న నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అదనపు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టి, మార్కెట్ ప్రాంతానికి ప్రత్యేక చొరవ చూపి, తగిన చర్యలు అమలు చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## లక్షెట్టిపేట మున్సిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పీఠం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఇక్కడ 15 వార్డులకు గాను 11 వార్డులు కాంగ్రెస్ సాధించింది. 3 వార్డులు బిఆర్ఎస్, 1 వార్డు బీజేపీ గెలిచింది. మ్యాజిక్ ఫిగర్ దాటడంతో కాంగ్రెస్ పీఠం దక్కించుకుంది. దీంతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

# మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయాలు

## మలక్ చించోలిలో మల్లన్న జాతర

సారంగాపూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సారంగాపూర్ మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ కమిటీలు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మండలంలోని మలక్ చించోలి గ్రామంలో గల అతి పురాతన ఆలయంలో మల్లన్న జాతర ఘనంగా జరగనుంది. జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 18న జబర్దస్త్ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, 19న అన్నదానం నిర్వహిస్తున్నట్లు గ్రామ నాయకులు కాల్వ నరేష్, గ్రామ పెద్దలు తెలిపారు. ఈ జాతరను చుట్టుపక్కల గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.



# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం

## ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి

సారంగాపూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:

నిర్మల్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి, అఖండ విజయాన్ని అందించిన ఓటర్లకు సారంగాపూర్ మండల మాజీ జెడ్పిటిసి పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన చైర్మన్ అభ్యర్థి అప్పల గణేష్‌ను ఆయన శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నిర్మల్ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఎం శ్రీ పాఠశాలలో వైభవంగా ఫుడ్ ఫెస్టివల్

సిరికొండ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:



సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ మండల ప్రజాపరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఆహార పదార్థాలపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ (ఆహార మేళా) ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు రకరకాల వంటకాలను ప్రదర్శించడమే కాకుండా, వాటి తయారీ విధానాన్ని క్లుప్తంగా వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునీశ్వర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు బాహ్య ప్రపంచంపై అవగాహన కల్పించేందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి, వారిలో వ్యాపార నైపుణ్యాలను పెంచడానికి ఈ ఫెస్టివల్ చక్కటి వేదికగా నిలిచిందన్నారు. న్యాయ నిర్ణేతలు వంటకాల రుచి, పరిశుభ్రత, ప్రదర్శన ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు. ఉపాధ్యాయుల విభాగంలో ప్రవల్లిక ప్రదర్శించిన వంటకానికి ప్రథమ బహుమతి లభించింది. అనంతరం విజేతలకు మండల విద్యాధికారి సునీల్, సర్పంచ్ బొడ్డు దత్తాత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కౌంటింగ్ శుక్రవారం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ప్రత్యేక అధికారి, మంచిర్యాల ఆర్.డి.ఓ శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్,లు పర్యవేక్షణలో ప్రక్రియ అంతా సజావుగా జరిగింది.ఒక ఏ.సి.పి నేతృత్వంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ క్యాతన్ పల్లి కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 48 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్.డి.ఓ శ్రీనివాస రావ్, మందమర్రి ఎం.ఆర్.ఓ సతీష్, క్యాతన్ పల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల కౌంటింగ్ శుక్రవారం క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ప్రత్యేక అధికారి, మంచిర్యాల ఆర్.డి.ఓ శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌ల పర్యవేక్షణలో ప్రక్రియ అంతా సజావుగా జరిగింది. ఒక ఏ.సి.పి



క్యాతన్‌పల్లి కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నేతృత్వంలో పోలీస్ బందోబస్త్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ క్యాతన్‌పల్లి కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 48 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకొన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆర్.డి.ఓ శ్రీనివాస రావ్, మందమర్రి ఎం.ఆర్.ఓ సతీష్, క్యాతన్ పల్లి మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, పాల్గొన్నారు.

# బాడీ బిల్డింగ్ పోటీలలో జిల్లా వాసి బంగారు పతకం సాధించడం అభినందనీయం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం 4 జిల్లాల పరిధిలో నిర్వహించిన సింగరేణి క్లాసిక్ బాడీ బిల్డింగ్ 1 పోటీలలో బంగారు పతకం సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భావన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, క్రీడల అధికారి మీనారెడ్డి, రవీందర్ లతో కలిసి సింగరేణి క్లాసిక్ బాడీ బిల్డింగ్ 1 పోటీలలో 65 కేజీల విభాగంలో బంగారు పతకం, మిస్టర్ బెల్లంపల్లి, ఛాంపియన్ ఆఫ్ ది ఛాంపియన్ ఓరల్ టైటిల్ ను సాధించినందుకు శాలువాతో సత్కరించి ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సింగరేణి స్థాయి పోటీలలో పాల్గొని విజయం సాధించి జిల్లాకు, గిరిజన సంక్షేమ శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని, భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో మరింత రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాల నివారణ

పెంచికల్ పేట్, ఫిబ్రవరి 13, ప్రభాత వార్త :

రోడ్డు ప్రమాదల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో కస్తూరిబా, ఎల్లూర్ ఆశ్రమ పాఠశాల, చర్చి చౌరస్తా, పాత పోచమ్మ కూడలి వద్ద శుక్రవారం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణ, విద్యార్థుల రద్దీ దృష్ట్యా ఈ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.



స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్న ఎస్సై అనిల్ కుమార్



విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న సర్పంచ్ తిరుపతి, ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఆసం అశోక్

# విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ

తాండూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :

మండలంలోని నీలాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సత్యమేవ జయతే ఫౌండేషన్ ద్వారా శుక్రవారం డిక్షనరీలు, పెన్నులు, పలకలను సర్పంచ్ పోలవేణి తిరుపతి, ఫౌండేషన్ మంచిర్యాల జిల్లా కోఆర్డినేటర్ ఆసం అశోక్ పంపిణీ చేశారు. సత్యమేవ జయతే ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాలలో భజన సత్సంగ్ సేవా కార్యక్రమాలు, పాఠశాల విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు, ధర్మంపై అవగాహన కల్పించడం మానవ విలువలు నేర్పించడం అభినందనీయమని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, సభ్యులు వినోద్ విద్యార్థులు పాల్గన్నారు.

# జడ్పీహెచ్ఎస్ ఆరెగూడ పాఠశాలలో సంపూర్ణత అభియాన్ 2.0పై విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త





కాగజ్‌నగర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ ఆరెగూడ పాఠశాలలో శుక్రవారం సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. నీతి ఆయోగ్ (ఎన్ఐటిఐ ఆయోగ్) మార్గదర్శకాల ప్రకారం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిలో విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యతను ఈ సందర్భంగా వివరించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ ఉపాధ్యాయురాలు బి. సుగుణ హాజరై బాలికలకు పౌష్టికాహారం, క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. సీనియర్ సైన్స్ టీచర్ బి. అనిత, ప్రాథమిక పాఠశాల అరెగూడ ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు టి. విజయలక్ష్మి మాట్లాడుతూ బాలిక విద్య ప్రాముఖ్యతను తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో హంగ్...

**- పుర పీఠంపై బీఆర్ఎస్ కన్ను కీలకమైన స్వతంత్ర అభ్యర్థులు బోణి కొట్టని భాజపా - ప్రశాంతంగా ఎన్నికల కౌంటింగ్**



కౌంటింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి



ఓట్లు లెక్కపెడుతున్న అధికారులు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త :**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో అనుకున్న విధంగానే ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో హంగ్ వచ్చింది. ఏ పార్టీకి కూడా పూర్తి మెజారిటీ రాలేదు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను భారాసకు 9, కాంగ్రెస్ కు 7, స్వతంత్రులకు 4 వార్డులలో విజయం సాధించారు. భాజాపా ఖాతా తెరువలేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థులు కీలకం కానున్నారు. గెలిచిన అభ్యర్థులను వారి పార్టీలు క్యాంప్ లకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీలు స్వతంత్ర అభ్యర్థులను తమదైన శైలిలో నాజారాణాలు చూపిస్తూ వేడుకుంటున్నారు. ఉత్కంఠభరిత వాతావరణం..... జిల్లా కేంద్రంలో శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ఫలితాలు ఉత్కంఠభరితంగా సాగాయి. ఉదయం నుంచే ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పోలీసుల పర్యవేక్షణలో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ప్రారంభమైంది. అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులు, అధికారులు లెక్కింపు హాళ్లలో తగిన నియమావళిని పాటిస్తూ పాల్గొన్నారు. ప్రతీ రౌండ్ ముగిసినప్పుడూ ఫలితాల ప్రకటనతో అభ్యర్థుల అనుచరులు ఉత్కంఠగా స్పందించారు. ముందంజలో ఉన్న అభ్యర్థుల శిబిరాల్లో ఆనందోత్సాహాలు కనిపించగా, వెనుకబడిన అభ్యర్థుల వర్గాల్లో ఆత్మపరిశీలన మొదలైంది. కొన్నిచోట్ల గెలుపు తేడాలు స్వల్పంగా ఉండటంతో చివరి రౌండ్ వరకు ఉత్కంఠ నెలకొంది. మహిళా అభ్యర్థులు, యువ నాయకులు గణనీయంగా విజయం సాధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక సమస్యలు, అభివృద్ధి హామీలు, పారదర్శక పాలన వంటి అంశాలు ఓటర్ల తీర్పులో ప్రధాన పాత్ర పోషించినట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఫలితాలు వెలువడిన అనంతరం విజేతలు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచిన ప్రతి ఓటరుకు సేవ చేయడానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. ఓటమి చెందిన అభ్యర్థులు కూడా ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని తెలిపారు. మొత్తానికి ఆసిఫాబాద్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల రోజు ప్రజాస్వామ్య ఉత్సవంగా నిలిచింది. ప్రశాంత వాతావరణంలో జరిగిన లెక్కింపు, స్పష్టమైన ఫలితాలతో స్థానిక పాలనలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. వార్డుల వారీగా ఎన్నికల ఫలితాలు..... రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఆసిఫాబాద్ పురపాలక సంఘంలో 20 వార్డులకు గాను గెలిచిన అభ్యర్థులను పరిశీలిస్తే......1వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి వినోద్ విజయం సాధించగా, 2వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి గోవింద్, 3 వ వార్డులో భారాస అభ్యర్థి మెంగ్రే ఆకాష్, 4వ వార్డులో భారాస అభ్యర్థి బాలకృష్ణ, 5వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అనుమాండ్ల స్వప్న రాణి, 6వ వార్డులో భారాస అభ్యర్థి చిలివేరి వెంకటేశ్వర్లు, 7వ వార్డులో భారాస అభ్యర్థి తణుకు భార్గవి, 8వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి లోనారే తార, 9వ వార్డులో భారాస అభ్యర్థి సాలం బిన్ అహ్మద్, 10వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి కామెది భాగ్యలక్ష్మి ్మ, 11వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి రాపర్తి కార్తిక్, 12వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం కృష్ణమ్మ, 13వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి గుండా స్నేహ, 14వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కొండా భారతి, 15వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుల్లా, 16వ వార్డులో భారాస అభ్యర్థి దూడల లక్ష్మి ్మ, 17వ వార్డులో భారాస అభ్యర్థి ఎండి అహ్మద్, 18వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి కస్తూరి పుష్ప, 19వ వార్డులో భారాస అభ్యర్థి నాగుబాయి, 20వ వార్డులో భారాస అభ్యర్థి జెబా షేక్ లు విజయం సాధించారు. బోని కొట్టని భాజాపా...ఆసిఫాబాద్ పుర ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బోని కొట్టలేక పోయింది. 18 వార్డుల్లో పోటీ చేసినప్పటికి 6, 20 వార్డుల్లో తప్ప మిగిలిన వార్డుల్లో పోటీ ఇవ్వలేకపోయింది. 6వ వార్డులో 215 ఓట్లు, 20వ వార్డులో 158 ఓట్లతో రెండో స్థానంలో నిలువగా మిగితా వార్డుల్లో మూడు, నాలుగు, ఐదు స్థానాలకే పరిమితమైంది. దీంతో ఆశావాహుల్లో నిరుత్సాహం నెలకొంది.



## క్రీడలతోనే మానసిక ఉల్లాసం

### - సిరికొండ ఎస్సై పూజ

**సిరికొండ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని సిరికొండ ఎస్సై పూజ అన్నారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని కొండాపూర్ గ్రామంలో గల పురాతన శివాలయం వద్ద నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని, నిత్యం వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. యువత చెడు మార్గాల వైపు మళ్లకుండా, భక్తి మార్గంలో నడుస్తూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు విట్టల్ పటేల్, అశోక్, లక్కం మల్లేష్, సునీల్, మాజీ సర్పంచ్ అనిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఆంగ్లమే భవిష్యత్తుకు మార్గం

### ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులకు సత్కారం

**నార్నూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

ఆంగ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నార్నూర్ మండలం తాడిహడప్నూర్ ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ఆంగ్ల భాషా పండితులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు బంకట్ లాల్, వసంతను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాథోడ్ బలిరాం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. టీచర్ వసంత మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో ఆంగ్లం కేవలం ఒక భాష మాత్రమే కాదని, అది వృత్తిపరమైన ఎదుగుదలకు కీలకమైన సాధనమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ ఆంగ్ల పదజాలాన్ని పెంచుకుంటూ, భాషపై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత పాఠశాలగా గుండంపల్లి

### విద్యార్థులకు స్టీల్ బాటిళ్ల పంపిణీ

**దిలావర్పూర్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**

పర్యావరణ పరిరక్షణలో దిలావర్పూర్ మండలం గుండంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై సర్పంచ్ రమణారెడ్డి తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా, పాఠశాల ప్రాంగణంలో కూడా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ క్రమంలో విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లకు స్వస్తి పలికేలా.. కొమ్ముల నవీన్ రెడ్డిశ్వేత దంపతులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి ఆర్థిక సాయం అందించి స్టీల్ వాటర్ బాటిళ్లను కొనుగోలు చేశారు. వాటిని పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, ఆరోగ్యానికి కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి విద్యార్థి పర్యావరణ ప్రేమికుడిగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## మానసిక ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలి

**జన్నారం,ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

మానసిక ఒత్తిడికి గురి కాకుండా పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధం కావాలని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ అన్నారు.శుక్రవారం రోజు జన్నారం మండలం తపాలాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు ఏ విధంగా సిద్ధం కావాలో డాక్టర్ ఉమాశ్రీ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షలకు వెళ్ళే సమయంలో తొందరపడవద్దని, సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలని సరైన నిద్ర, మంచి ఆహారం, యోగా మెడిటేషన్ వల్ల మానసిక ఒత్తిడిని నివారించవచ్చునని విద్యార్థులకు తెలియజేశారు. పరీక్షా ఫలితాలు ఏ విధంగా వచ్చిన సానుకూల దృక్పథంతో ఉండాలని సూచించారు అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజన వంటశాల పరిసరాలను పరిశీలించి నిర్వాహకులకు పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి సందీప్, హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఆశా కార్యకర్త లలిత, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రిక, గోపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.



## మృతి చెందిన బీజేపీ అభ్యర్థికి 171 ఓట్లు

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



లక్షెట్టిపేటలోని 10వ వార్డులో మృతి చెందిన బీజేపీ అభ్యర్థి బత్తిని ఎల్లమ్మ 3వ స్థానంలో నిలిచారు. 10వ వార్డులో మొత్తం 910 ఓట్లు ఉండగా, 684 ఓట్లు పోలయ్యాయి. అందులో ఎల్లమ్మకు 171 ఓట్లు వచ్చాయి. ఈ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి పెండెం పద్మ 3 ఓట్లతో విజయం సాధించారు. నామినేషన్ వేసిన తర్వాత మూడో రోజు నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో లక్ష్మి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతిపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలం శాంతాపూర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని దోనబండ గ్రామానికి చెందిన గుండవేని లక్ష్మయ్య అనే 77 సంవత్సరాల వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడి స్వస్థలం దోనబండ గ్రామం. మృతుడు గురువారం అంకత్ పల్లి లోని తన బంధువుల ఇంటికి వెళ్లి అక్కడ పని ముగించుకొని రాత్రి ఇంటికి బయలుదేరాడు. చీకటి పడడంతో వాహనాలు ఏమి లేకపోవడంతో నడుచుకుంటూ వెళ్తుండగా, ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయాడు. చీకటి పడటంతో మృతదేహం పైనుండి ఇతర వాహనాలు పోవడంతో మృతదేహం నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మంచిర్యాల ఆస్పత్రికి తరలించి మృతుని కొడుకు మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుంది.